కాంగ్రెస్ తెచ్చిన కరువు



### రెండు బ్యాగుల జొన్న పంట ఎండింది..

నాకున్న వ్యవసాయ భూమి లో రెండు బ్యాగుల జొన్న సాగు చేశా. సాగు కోసం రూ.15 వేలు ఖర్చు చేశా. పంట చేతికొచ్చే సమయానికి నీరు లేకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. ఎండల తీవ్రతకు బోర్ బావులు కూడా అడుగంటి పోయాయి. చొప్ప మాత్రం పశువులకు పనికొస్తుందని ఆవేదన చెందాడు. సమయానికి భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో చాలా నష్టం జరిగింది. పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలు ఆదుకోవాలి.

*- జాదవ్ దశరథ్, హర్కాపూర్‌తండా, రైతు.*



ఇంద్రవెల్లి మండలం కెస్లాగూడలో అడుగంటిన వ్యవసాయ బావి



అడుగంటిపోయిన వడగాం వాగు



హర్కాపూర్‌తండాలో సాగునీరు లేక ఎండిపోయిన జొన్నపంట

## అడుగంటిన భూగర్భ జలాలు.. వట్టిపోతున్న పంటలు

# కన్నీటి సుడులు

**మండుతున్న ఎండలతో ఎడారిని తలపిస్తున్న పల్లె ప్రకృతి వనాలు**


**నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్న రైతులు**



మచ్చాపూర్‌లో అడుగంటిన వ్యవసాయ బోరు



**భానుడు ఉగ్రరూపం** దాల్చడంతో బోర్లు, బావులు, చెరువులు, వాగులు, జలాశయాలు అడుగంటి పోతున్నాయి. యాసంగిలో వేసిన పంటలు చివరి దశలో ఉండడంతో కండ్ల ముందే వట్టిపోవడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. పల్లె ప్రకృతి వనాలు కూడా ఎడారిని తలపిస్తున్నాయి. పశువులు, ముగజీవాలు, పక్షులు నీటి కోసం తండ్లాడుతున్నాయి. మండలంలోని హర్కాపూర్‌తండాకు చెందిన జాదవ్ దశరథ్, ఇంద్రవెల్లికి చెందిన ముండే వెంకటి, కేస్లాగూడ(ఎం)కు చెందిన మిర్జా అబ్రార్‌బేగ్ జొన్న పంటలు సాగు చేశారు. సమయానికి సాగు నీరు అందకపోవడంతో పూర్తిగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోవడంతో వేల రూపాయల ఆర్థిక నష్టం జరిగిందని.. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు. - ఇంద్రవెల్లి, ఏప్రిల్ 2



ఇంద్రవెల్లిలో సాగునీరు లేక ఎండిపోయిన జొన్నపంట

### ఐదెకరాల్లో జొన్న విత్తనాలు వేసి వదిలేశా..

నాకున్న ఐదెకరాల భూమిలో జొన్న విత్తనాలు విత్తాను. సాగు నీరు లేకపోవడంతో అలాగే వదిలేశా. విత్తనాలతోపాటు భూమిలో దుక్కి దున్నడానికి రూ.35 వేలు ఖర్చు చేశా. భూమిలో జొన్న విత్తనాలు వేసి ఎరువులు కూడా వేశా. అప్పటికి బావి అడుగంటి పోవడంతో వేసిన పంటకు నీరు అందించలేదు. ఎంతో ఆశతో జొన్న విత్తనాలు భూమిలో వేసినా. బావిలో పూడిక మట్టి తీసినా భూగర్భ జలాలు పెరగడం లేదు. నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.

*- ముండే సంజీవ్, రైతు, ఇంద్రవెల్లి.*



సాగునీరు లేకపోవడంతో ఎండిపోయిన పుచ్చకాయలు



ఎండిపోయిన పల్లె ప్రకృతి వనం

## అప్రమత్తతే ఆయుధం

- **సైబర్ క్రైమ్‌కు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**

ఎదులాపురం, ఏప్రిల్ 6 : సైబర్ క్రైమ్ నేరాలను అడ్డుకట్ట వేయాలంటే అప్రమత్తతే పదునైన ఆయుధం అని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. యువత, ప్రజలు ముఖ్యంగా ఆన్‌లైన్‌లో థర్డ్ పార్టీ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోకుండా ఉండాలన్నారు. డబ్బు అత్యాశకు వెళ్లి తమ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు తెలుపొద్దని సూచించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు, క్రిప్టో కాయిన్, మల్టీ లెవెల్ మార్కెటింగ్, డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్ ఫ్రైడ్, స్టాక్ మార్కెటింగ్‌లో అపరిచిత వ్యక్తులతో ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, నకిలీ లోన్ యాప్స్, నకిలీ వెబ్ సైట్లు ఉన్నాయని చెప్పారు. వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఈ వారంలో ఆదిలాబాద్ జిల్లాలో ఎనిమిది సైబర్ క్రైమ్ ఫిర్యాదులు అందాయన్నారు.

**ఫిర్యాదులు..**

- ఆదిలాబాద్ పట్టణంలోని భావన పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుతో ఒక వ్యక్తి అత్యధిక డబ్బును ఆన్‌లైన్‌లో స్టాక్ మార్కెట్ ద్వారా సంపాదించి పెడతానంటూ చెప్పడంతో తన సొంత వివరాలు ఆధార్, పాన్ కార్డు వంటి వివరాలతో ఒక డిమార్ట్ అకౌంట్ తెరిచి, అందులో రూ.5,29,503ను విడతలవారీగా వేశాడు. అందుకు సైబర్ నేరగాడికి తన వ్యక్తిగత సమాచారం పూర్తిగా ఉన్న ఆ డి మార్ట్ ఖాతాలో బాధితుడికి తెలియకుండా ట్రేడింగ్ చేసి నష్టాల బారిన పడేశాడు.
- ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి లోన్ అప్లికేషన్ ఆన్‌లైన్ ద్వారా థర్డ్ పార్టీ అప్లికేషన్ వేసుకుని తన ఫోన్‌లోని అన్ని పర్మిషన్‌లు ఇచ్చాడు. తన వ్యక్తిగత సమాచారం అంతా ఆన్‌లైన్ సైబర్ క్రైమ్ నేరస్తులు తస్కరించి, నగ్నంగా మార్ఫింగ్ చేసి తన మిత్రులకు కుటుంబ సభ్యులకు ఫొటోలు, వీడియోలు పంపిస్తామని బెదిరించారు.
- తాంసి మండలంలోని ఒక మహిళ తన వాట్సాప్ గ్రూపులో ఉన్న ఒక అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల తన వాట్సాప్ హ్యాక్ అయింది. దాని ద్వారా సైబర్ నేరగాళ్లు తన యూపీఐ నుంచి దాదాపు రూ.ఐదు వేలను తస్కరించారు.
- బజార్‌హత్నూర్ మండలంలో ఒక వ్యక్తి కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని సైబర్ నేరగాళ్లు బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ చేశారు. అతని వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్ మోసగానికి తెలుపడంతో రూ.19,600 నష్టపోయాడు.

## బెట్టింగ్ నిషేధం

**చేస్తున్న వారిపై నాలుగు కేసులు**

ఎదులాపురం, ఏప్రిల్ 6 : బెట్టింగ్‌కు అలవాటు పడి యువత ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్‌కు అలవాటు పడి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. మోసపూరిత ప్రకటనలు, సందేశాలు చూసి బెట్టింగ్‌కు పాల్పడడం, గుర్తింపు లేని ఆన్‌లైన్ సంస్థల్లో డబ్బులు పెట్టుబడి పెట్టడం వల్ల చాలా మంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహించే వారిపై నిఘా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు చేస్తు న్న పనుల గురించి ఆరా తీయాలని తెలిపారు.

**ఈ రోజు నమోదైన కేసులు**

- రాంనగర్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న షేక్ రియాజ్ పట్టుబడ్డాడు. ఇతనితోపాటు మహారాష్ట్రలోని కిన్వవాట్‌కు చెందిన ఆరిఫ్,లడ్డూ హన్‌లపై కూడా కేసు నమోదు చేశారు. ఇతని నుంచి మొబైల్, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- పిట్టలవాడకు సంబంధించిన గంధాడే సోహన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా మావల పార్క్ వద్ద పట్టుకున్నారు. ఇతని వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.ఐదు వేల నగదు సీజ్ చేశారు. ఇతనిపై మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.
- ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఖుర్షాపూర్ ఖిల్లా ఏరియాకు చెందిన సుల్తాన్, ఒక మైనర్ సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడుతున్నారని, వారిపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వీరిద్దరు రెండు రోజుల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా రూ.15 వేలు పోగొట్టుకున్నారు.



చెస్‌పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

## చెస్ పోటీలు ప్రారంభం

బాసర, ఏప్రిల్ 6 : బాసర ట్రిపుల్ ఐటీలో ఆదివారం విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. వీటిని వీసీ గోవర్ధన్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణిలు కలిసి ప్రారంభించారు. రెండు రోజులపాటు పోటీలు జరగనున్నాయి. గ్రామీణ యువత, విద్యార్థుల్లో చెస్‌ను ప్రోత్సహించేందుకు చెస్ నెట్‌వర్క్ సంస్థ హైదరాబాద్‌లోని గ్యాప్ స్కిల్స్ లెర్నింగ్ సొల్యూషన్ మద్దతుతో ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని వీసీ గోవర్ధన్ అన్నారు. ఈ కార్యక్రమంలో చెస్ నెట్‌వర్క్ బృందం సభ్యులు సంజయ్ గజ్జల, అధ్యక్షుడు హరి శ్రేరామోజు, ప్రధాన కార్యదర్శి రాజన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జీయూకేటీ స్పోర్ట్స్ స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు, పీడీ శ్యాంబాబు పాల్గొన్నారు.

## ఏడుగురిపై కేసు

ఎదులాపురం, ఏప్రిల్ 6 : వరకట్నం కోసం వేధించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన రిమ్షా ఫిర్దోస్, తాటి గూడకు చెందిన సైబాస్ ఖాన్ పీజీటీ టీచర్ (అవుట్ సోర్సింగ్) ఉద్యోగితో 22 అక్టోబర్ 2023 పెద్దల సమక్షంలో పెళ్లి జరిగింది. రూ. ఆరు లక్షలు, ఏడు తులాల బంగారం, 15 తులాల వెండి, ద్విచక్ర వాహనానికి రూ.లక్ష, రూ.రెండు లక్షల విలువ గల ఇంటి సామాను ఇచ్చారు. పెళ్లయిన రెండు నెలలు మాత్రమే భార్యాభర్తలు కలిసి ఉన్నారు. ఆ తర్వాత అదనపు కట్నం రూ.3 లక్షలు తీసుకురావాలని భర్త వేధింపులు గురి చేసేవాడు. భర్తతోపాటు అత్తమామలు మజీదా బేగం, రఫీవుల్లా ఖాన్, ఆడబిడ్డలు యష్మీన్, జువేరియా, ఆమె భర్త అల్లావుద్దీన్, అలాగే మరిది షోబ్ ఖాన్ అదనపు కట్నం కోసం వేధించారు. పెద్దల సమక్షంలో పంచాయతీలు పెట్టిన అత్తింటి వాళ్లలో మార్పు రాలేదు. 23 ఆగస్టు 2024 మజీద్ కమిటీ సమక్షంలో పంచాయతీ పెట్టి నచ్చజెప్పి బాధితురాలని అత్తింటికి పంపించారు. రెండు రోజుల తర్వాత రూ.3 లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులు గురి చేశారు. విడాకులు కావాలంటూ భర్తతోపాటు కుటుంబ సభ్యులు ఆమెపై ఒత్తిడి చేశారు.17 నవంబర్ 2024 అదనపు కట్నం తీసుకురావాలని లేదంటే రిమ్షా ఫిర్దోస్ చంపేస్తానని కుటుంబ సభ్యులు బెదిరించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భర్తతోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు.



జైనథ్ : భోరజ్ సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న



బోథ్ : స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## పాడి పంటలతో చల్లంగా ఉండాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**

జైనథ్, ఏప్రిల్ 6 : ఆదిలాబాద్ జిల్లాతోపాటు ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న వేడుకున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఉమ్మడి జైనథ్ మండలంలోని భోరజ్ శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవర్ధన్, గిమ్మ ఎంపీటీసీ కోల భోజన్న, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి వి.నారాయణ, వైస్ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, నాయకులు జి.అశోక్ రెడ్డి, మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.


**కన్యాదానం చేసిన ఎమ్మెల్యే**

బోథ్, ఏప్రిల్ 6 : బోథ్, సొనాల మండలాల్లో ఆదివారం శ్రీరామ నవమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సొనాలలోని రామాలయంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకలకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే రామాలయానికి తీసుకొచ్చారు. రాముల వారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలన్నారు.

వరల్డ్ హెల్త్ డే శుభాకాంక్షలు

ఈ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా,
ఆరోగ్యకరమైన ప్రపంచం పట్ల మన నిబద్ధతను
పునరుద్ఘాటిద్దాం. కలిసి పనిచేయడం,
అవగాహన పెంచడం మరియు
స్పృహతో కూడిన ఎంపికలు చేసుకోవడం ద్వారా,
అందరికీ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ
అందుబాటులో ఉండే
భవిష్యత్తు వైపు మనం ముందుకు సాగవచ్చు,
ఆరోగ్యంగా ఉండండి, సురక్షితంగా ఉండండి !

RMP DOCTORS ASSOCIATION NIRMAL



## నాడు పచ్చదనం.. నేడు ఎండుదనం..

*ఆదిలాబాద్ అంటేనే ప్రకృతి అందాలకు ఆలవాలం. చలి, వర్షాకాలాల్లో మరో కశ్మీర్‌ను తలపిస్తుంది. ప్రకృతి అందాలను తిలకించడానికి ప్రకృతి ప్రేమికులు వందల కిలోమీటర్లు ప్రయాణించి వస్తుంటారు. విభిన్నమైన జంతువులు, పక్షులు.. రకరకాల వృక్షజాతులు కనువిందు చేస్తాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల దారిలో గుట్టలపై యేటా వర్షాకాలంలో పచ్చదనం కనువిందు చేసేది. వేసవిలో ఎండలతో పచ్చదనం కనుమరుగై ఆ ప్రాంతం బోసిపోయినట్లు కనిపిస్తున్నది. ఆ చిత్రాలే మీ కోసం..*

*- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్*

